# అమరుల త్యాగఫలమే స్వాతంత్య్రం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు


కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో..


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కాంతారావు తదితరులు

**కూకట్‌పల్లి:** స్వాతంత్య్ర పోరాట అమరుల త్యాగ ఫలమే నేటి స్వేచ్ఛ అని, వారి త్యాగాల స్ఫూర్తితో నేటి తరం ముందుకు వెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్కు వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న ప్రతి ఒక్కరూ తమ ఇంటి పైన జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తి చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ సంస్థ సభ్యులు, కళాశాల విద్యార్థులు, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**కూకట్‌పల్లి:** హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ గురువారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాస్ యాదవ్, పోలీస్ సిబ్బంది, బీజేవైఎం నాయకులతో కలిసి జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణారెడ్డి, సందీప్, నాయకులు విశాల్, జయరాం, పవన్, రంజిత్, మహిళా పోలీస్ సంగీత, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సద్గురు సాయినాథ్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు

**బాలానగర్:** బాలానగర్ డివిజన్, జేపీఆర్ ద్వారకామయి కాలనీలో సద్గురు సాయినాథ్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం యాదగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వదించి ఆయనకు ప్రసాదాన్ని అందజేశారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**గచ్చిబౌలి:** బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తోట జగదీష్ ప్రసాద్(38) మాదాపూర్‌లో ప్రైవేట్ కంపెనీలో అడ్మిన్ విభాగంలో పని చేస్తూ బీరంగూడలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 13 తెల్లవారు జామున 2 గంటలకు విధులు ముగించుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. గచ్చిబౌలి స్టేడియం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

## పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

సీఐ సామల వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటరెడ్డి

**మోతీనగర్:** పండుగలు, పర్వదినాలను ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి శాంతియుతంగా జరుపుకోవాలని అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పర్వత్‌నగర్ మినీ కమిటీ హాల్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాల్యానాయక్, వివిధ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మండప నిర్వాహకులు, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 9 మంది అరెస్ట్

**మాదాపూర్:** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 9 మందిని మాదాపూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు.13వ తేదీ మాదాపూర్‌లోని పలుప్రాంతాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న (ఏహెచ్‌టీయు) యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అప్రమత్తమైంది. పర్వత్‌నగర్ వద్ద ఉన్న బీఎస్‌ఆర్ సూపర్ లగ్జరీ , లివింగ్ హోటల్‌లో ఆర్గనైజర్ హమేర్‌సింగ్ అలియాస్ హమిద్‌సింగ్‌తో పాటు పలువురు దేశంలోని పలు ప్రాంతాల నుంచి యువతులను కొనుగోలు చేసి లోకాంటో, స్కోక్కా వంటి వెబ్‌సైట్‌లలో ప్రకటనలు చేస్తు కాల్స్, వాట్సాప్ ద్వారా కస్టమర్లను సంప్రదిస్తున్నారు. ఓయో రూమ్‌లతో పాటు పలు హోటళ్ళలో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వేర్వేరు ప్రాంతాలు (పశ్చిమబెంగాల్, ఢిల్లీ, ఝార్ఖండ్, హర్యానా, పంజాబ్, ఉజ్బెకిస్తాన్)నుంచి వచ్చిన యువతులను పోలీసులు రక్షించారు. కొంత మంది ఉద్యోగాల పేరుతో యువతులను పిలిపించి వారితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు.

## నేడు సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో వేడుకలు

**ఆల్విన్‌కాలనీ:** సీనియర్ సిటిజన్స్ సంఘాల సమాఖ్య, కూకట్‌పల్లి చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు గురువారం తెలిపారు.వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్స్ భవనంలో సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో మన త్రివిధ దళాలు, రక్షణ రంగ నిపుణుల పాత్ర తదనంతరం దేశంలో, ప్రపంచంలో ఏర్పడిన పరిణామాలపై ప్రసంగాలు ఉంటాయని నిర్వాహకులకు పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా ఫెడరేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్, కె.పి చాప్టర్ వై. వేదమూర్తి, ముఖ్య అతిథి, ప్రధాన వక్తగా హైకోర్టు న్యాయవాది నారుమంచి వెంకట అనంత కృష్ణ తదితరుల ప్రసంగాలు ఉంటాయన్నారు.

## 10 కిలోల గంజాయి స్వాధీనం

**గచ్చిబౌలి:** గంజాయి అమ్మేందుకు యత్నిస్తున్న వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ తెలి పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 13న మధ్యాహ్నం రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా కోర్దా జిల్లాకు చెందిన రైతు మహరాన దీనబంధు(40) ఒడిశా కటక్ చెందిన బీటెక్ విద్యార్థి అభిషేక్ మహపాత్ర(23)తో కలిసి గంజాయి విక్రయిచేందుకు సిద్ధంగా ఉన్నారు. వారి వద్ద బ్యాగ్‌లో 10 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా దస్పల్లా గ్రామానికి చెందిన జోగేష్ అనే వ్యక్తి నుంచి గంజాయి తీసుకొని రెండేళ్లుగా విక్రయిస్తున్నట్లు దీనబంధు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**ఆల్విన్‌కాలనీ:** ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్‌లో త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు జనార్ధన్‌రావు, పోశెట్టి గౌడ్, రమేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.